**నవ్వు చెరిగిన ఆ వీనస్ మొహంమీదకు మళ్ళీ నవ్వెలా వచ్చింది? కథ రచయితది; ముగింపు మీది!**
**[చివరి పేరా ముందుగా చదవకండేం!]**

# నవ్వు

పసుపులేటి తాతారావు

ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది. సాలార్‌జంగ్ మ్యూజియమ్‌లోని 'వీనస్' విగ్రహానికి ఏ మహానుభావుడో ప్రాణ ప్రతిష్ఠ చేశాడా అన్నంత అందంగా ఉంది. కను ముక్కు తీరు, అనవయువ సౌష్ఠవం, ఒంపూ సొంపూ... అన్నీ కలిసి ఆమె నొక అద్భుత సౌందర్య రాశిలా నిలబెట్టాయి.

అయితే, అంత అందమైన అమ్మాయి ఏ భవనంలోనో, బంగ్లాలోనో ఉండక ఈ చిన్ని టీ కొట్టు నడుపుతూ ఉండాల్సిన గతి ఎందుకు పట్టిందో నాకు అర్థం కాలేదు. విధి విలాసమంటే ఇదే కాబోలు!

ఆ అమ్మాయిలో నేను గమనించిన మరో విశేష మేమిటంటే వారం పది రోజులుగా నే నా అమ్మాయిని చూస్తున్నా ఒక్కసారి కూడా ఆమె ముఖంమీద నవ్వును చూడలేకపోయాను. రాను రాను ఆ అమ్మాయి కనలు నవ్వడం చేత నవునో, లేదో అన్న అనుమానం కూడా బయలుదేరింది నాలో. ఏదో ఒక టైమ్‌లో నవ్వకపోతుందా అని గంటల తరబడి చూసినా, అబ్బే... నవ్వేది కాదు.

అంత చక్కని అందమైన ముఖంమీద ఒక్క చిన్న చిరునవ్వు తళుక్కుమంటే అది ఎంత అద్భుతంగా ఉంటుందో? నాలో ఒక చిత్రమైన కోరిక రోజు రోజుకీ బలపడుతూ వస్తోంది. నే నింకా ఈ ఊళ్ళో మహా అయితే ఇంకో వారం రోజు లుంటా నంతే. ఈలోపునే ఎలాగైనా సరే, ఆమె ముఖం మీద నవ్వు చోటు చేసుకోవడం చూడాలి. ఆ అరుదైన అందాన్ని ఒక్కసారంటే ఒక్కసారి చూసి తరించాలి. అప్పుడు గానీ ఈ ఊరు వదిలి వెళ్ళకూడదు. అదీ నాలో బలపడిన కోరిక.

నాలుగు రోజులు క్రిందట టీ తాగే వంకతో ఆ అమ్మాయి దగ్గరికి వెళ్ళాను. టీ తాగుతూనే ఆమె అందాన్ని పరిశీలించసాగాను. పైటను వెనకనుండి ముందుకు లాగి బొడ్డున దోపి ఉంది. ఆ దెంతో అందా న్నిచ్చిం దామెకు. ముక్కున ముక్కెర, చెవులకు కమ్మలు, చేతులకు పచ్చటి పాళ్ళ గాజులు... అన్నీ ఆమెకోసమే సృష్టించబడ్డట్టు చక్కగా అమరిపోయాయి. అయితే ఆమెలో నాకు నచ్చనిదీ, వెగటుగా తోచిందీ ఒకటే - పసుపుతాడు!

"మీ పేరు?" సంశయిస్తూనే అడిగాను. ఇలాంటి పల్లెటూళ్ళలో అలా అడగడం తప్పే. ఒక అబ్బాయి ఒక అమ్మాయిని పలకరించి మాట్లాడ్డమే పెద్ద నేరం.

ఆమె నావైపు మిర్రున చూసింది - "నా పేరుతో మీ కేంటి పని?" అని అడిగింది కోపంగా.

అంత కోపంలో కూడా ఆమె ముఖం చూసి చాలా ముచ్చటేసింది. అపర సత్యభామలా ఉం దా రూపం.

"అబ్బబ్బే... ఏం లేదు. ఊరికినే అడిగాను. నా కెలాంటి దురుద్దేశమూ లేదండీ. నిజానికి మా ఊళ్ళో అందరూ న న్నెంతో 'బుద్ధిమంతుడు' అంటారు. టెన్త్ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను, ఇంటర్ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను, డిగ్రీ - అఫ్‌కోర్స్ - సెకండ్ క్లాస్‌లో పాస్ అయ్యా ననుకోండి. ఆమధ్య క్రికెట్ మీద మోజు మళ్ళింది. లేకపోతే అది కూడా ఫస్ట్ క్లాసే వచ్చి ఉండేది. కాండక్ట్ సర్టిఫికెట్‌లో నేను చాలా మంచివాణ్ణని రాశారు. కావాలంటే మా ఊరు పెద్దమనుషు లిద్దరితో సాక్ష్యం కూడా చెప్పించగలను." కంగారుతో తడబడినట్లు నటిస్తూ అన్నాను. ఇదంతా కేవలం ఆమె చేత నవ్వించడానికే అన్నాను. ఎలాగైనా ఆమె చేత ఒక్కసారైనా నవ్వించి, ఆ అపురూప సౌందర్యాన్ని చూసి వెళ్ళాలని నా పంతం. అంతకు మించి నిజంగానే నాలో ఎలాంటి దురుద్దేశమూ లేదు.

అయితే, ఆమె నవ్వితేనా? కోపం పోయి ముఖంలో ప్రసన్నత చోటు చేసుకుం దంతే.


"మరయితే ఎందు కడిగినట్లు నా పేరు?" అని అడిగింది.

"ఇంతటి అపూర్వమైన అందం నే నెక్కడా చూడలే దింతవరకూ. అందుకే, ఆ కుతూహలంతోనే పేరు తెలుసుకోవా లనిపించీ..."

మాట సగంలోనే ఆపేసి ఆమె ముఖం వంక పరిశీలనగా చూశాను. ఆ మాటకైనా ఆమెలో సిగ్గుతో కూడిన రవ్వంత చిరునవ్వు అరక్షణం పాటైనా మెరుస్తుందేమోనని. ఊహుఁ... లాభం లేదు.

ఆమె ముఖ దీపంలో చిరునవ్వు జ్యోతిని వెలిగించే దెలా? ముడుచుకుపోయిన ఆమె ముఖపద్మం వికసించే దెప్పుడు? ఏం చేసి ఆమె ముఖంలో నవ్వులు పూయించగలను? అన్నదే నా తపన అయిపోయింది.

తమ అందాన్ని పొగిడితే ఆడవాళ్ళు తెగ ఆనందపడిపోతారని అంటారు. ఆ ఆనందంలో రవ్వంతైనా చిరునవ్వు ఉద్భవించకపోతుందా అని అలా పొగిడాను. పరాయి స్త్రీ అందాన్ని పొగడ్డం తప్పని నాకు తెలుసు. కానీ ఏం చేయను? నా స్వార్థం నాది. ఏదో విధంగా చందమామ లాంటి ఆమె ముఖంలో వెన్నెల కిరణం లాంటి చిరునవ్వు మెరిపించాలనీ, ఆ అద్భుత సౌందర్యాన్ని నా మస్తిష్కంలో భద్రపరచాలనీ నాలోని భావుకుడు,



సౌందర్యారాధకుడు తెగ ఆరాటపడుతున్నాడు. ఆకాశంలో విరిసిన హరివిల్లు అందాన్ని చూసి ఆహా అనడంలో తప్పు లేనట్లే, వెన్నెల్లో మెరిసే తాజ్‌మహల్ సౌందర్యాన్ని చూసి ఓహో అనడంలో తప్పు లేనట్లే, నా నామె ముఖంమీద చిరునవ్వు చూడాలని ఆశపడ్డంలో కూడా ఎలాంటి తప్పు లేదని నా అభిమతం.

కానీ, అదేం చిత్రమో! నా కోరిక నెరవేరేట్లు లేదు. ఆమె నవ్వనని భీష్మించుకు కూర్చున్న దానిలా ఉంది.

అప్పట్నుంచీ రోజూ పొద్దు న్నొకసారీ, సాయంత్రం ఒకసారీ టీ తాగే వంకతో ఆమె దగ్గరికి వెళ్తుండే వాణ్ణి. మాటల్లోకి దించి రకరకాల జోక్స్ చెప్పేవాడిని. ఎంతో చమత్కారంగా మాట్లాడే వాడిని. కానీ ప్రయోజనం శూన్యం. ఆమె ముఖంలో నవ్వు వెలిగేది కాదు.

నా మాటకారితనం మీద నాకు చాలా నమ్మకం. నా చుట్టూ చేరే మిత్రులు అరనిముషం గడవకముందే ఎంతో కొంత నవ్వకుండా ఉండలేరు. అలాంటిది ఈ అమ్మాయిని ఎంతమాత్రం నవ్వించలేకపోతున్నానంటే... చాలా ఆశ్చర్యంగా ఉంది.

"నా కంఠంలో ప్రాణం ఉండగా నవ్వనుగాక నవ్వను - అని ఎప్పుడైనా శపథం లాంటి దేమైనా చేశారా?" అని అడిగాను ఒక రోజు నవ్వుతూ.

"అలాంటి దేమీ లేదు" అన్న దామె నవ్వకుండానే!

"ఇప్పుడు మీకు నే నొక దీపం ఇచ్చా ననుకోండి. అప్పుడైనా నవ్వుతా రా కనీసం?" అని అడిగాను మరో రోజు.

"ఏ దీపం?" అని అడిగింది ఆశ్చర్యంగా ముఖం పెట్టి.

"అల్లా ఉద్దీన్ అద్భుత దీపం" అన్నాను.

"ఆ దీపం ఇస్తే నే నెందుకు నవ్వాలి?" అని అయోమయంగా అడిగింది.

"ఎందు కేమిటి? ఆ దీపాన్ని చేత్తో రుద్దితే



బంగళా కావాలంటే బంగళా వస్తుంది. కారు కావాలంటే కారు వస్తుంది. రవ్వల నెక్లేస్ కావాలంటే రవ్వల నెక్లేస్, వడ్డాణం కావాలంటే వడ్డాణం... ఇంకా కంచిపట్టు చీరలు, కాలి పట్టీలు, చెంపస్నులు, గాజులు... ఒక టేమిటి? ఏది కోరినా క్షణంలో తెచ్చి మీ ముందు పడేస్తాడు భూతంగాడు. అవన్నీ చూశాకనైనా మీకు నవ్వు రాదా?''

''రాదు!''

''మ రెప్పు డొస్తుంది?''

''నాకు తెలీదు'' అన్నది.

నేను హతాశుడి నయ్యాను. ''ఆరి దేవుడా!'' అని నిట్టూర్చాను. ఈమె చేత నవ్వించడం బ్రహ్మ తరం కూడా కాదేమో? కలగక కలగక కలిగిన ఓ చిన్న కోరిక. అతి చిన్న కోరిక. కానీ అది నెరవేరే అవకాశమే గగన కుసుమం అవుతోంది.

ఆ రోజు కూడా నిరాశతోనే గదికి చేరుకున్నాను. కన్ను మూసినా, తెరిచినా ఆమె రూపమే మెదులుతోంది నా మనసులో. అసలు ఆ అమ్మాయికి న వ్వెందుకు రావడంలేదో అర్థం కావడం లేదు. నేను ఈ ఊరు విడిచి వెళ్ళాల్సిన రోజు దగ్గర పడేకొద్దీ నాలో ఆ కోరిక మరింత బలంగా పాతుకుపోతోంది. కానీ అది తీరే ఆశ అంతకంతకీ వెనక్కి పోతోంది. దాంతో చెప్పలేని అసహనం లోలోపల పేరుకుపోతోంది.

''ఏమండోయ్! 'నవ్వు నాలుగిందాల చేటు' అన్న సూక్తిని కానీ బాగా వంట పట్టించుకున్నారా ఏమిటి? ఆ సూక్తి ఎప్పుడో పాత బడిపోయింది. ఇప్పు డంతా 'నవ్వు నాలుగందాల స్వీటు' అంటున్నారు. అందులోనూ, మీరు నవ్వితే మతాబు వెలిగినంత కాంతిగా ఉంటుందని నా నమ్మకం. అందుచేత, నవ్వండి... ప్లీజ్! నవ్వండి...'' అని బ్రతిమాలాను ఒక రోజు.

ఆమె నావైపు చూసి తల దించుకుంది. అంతే, నవ్వలేదు.

నేను నిర్విణ్ణు నయిపోయాను. సందేహం లేదు. ఇ దేదో శాపం బాపతే అయ్యుండాలి. ఏ మునీశ్వరుడో ఈమెను చూసి మోహించి ఉంటాడు. తన కోరిక తీర్చకుండా నిరాకరించిందన్న కోపంతో ఆ మునీశ్వరుడు - 'నీ ముఖంలో నవ్వు శాశ్వతంగా చెరిగిపోవు గాక!' అని శపించేసి ఉంటాడు. అంతే! అలాగే జరిగుండాలి. లేకపోతే, సృష్టిలో ఏ జీవికీ లేని లక్షణం, మానవ జాతికి మాత్రమే లభించిన అపురూప వరం - నవ్వు. ఆమె కొక్కదానికే ఎందుకు లేకపోవాలి?

ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో కానీ ఆమెకి చాలా ఘోరమైన అన్యాయమే జరిగిపోయింది. అద్భుతమైన సౌందర్యం ఆమె ముఖంలో ఉట్టిపడుతోంది. కానీ ఏం లాభం? ఎవరో ఆమె ముఖం మీది నవ్వుని చెరిపేశారు. ప్రకృతికే శోభాయమానమైన ఒకానొక సుందర రూపాన్నుండి ఎవరో జీవకళని లాక్కుపోయారు. ఇక ఎంత ప్రయత్నించినా ఫలితం శూన్యం. నా ఆశ అడియాసే.

ఈ ఊరికి నే నొచ్చిన పని పూర్తయిపోయింది. ఇవాళే నేను వెళ్ళిపోవాలి. పెట్టే, బేడా సర్దుకున్నాను. రూమ్ ఖాళీ చేసి ఓనర్‌కి అప్పగించి బయలుదేరాను.

వెళ్ళే ముందు మనసు చంపుకోలేక ఆఖరిసారిగా మరొక్కసారి ప్రయత్నించుదామని ఆమె దగ్గరికి వెళ్ళాను. ఆమె టీ ఇచ్చింది.

''నే నివాళ వెళ్ళిపోతున్నాను'' అన్నాను టీ చప్పరిస్తూ.

ఆమె నావైపు అదోలా బేలగా చూసింది. పదిహేను రోజుల పరిచయం దూరమై పోతూందనో, ఏమో? ఆ చూపుకి అర్థ మేమిటో నాకు సరిగ్గా బోధపడలేదు.

''ఏమండీ! మీరు నవ్వితే ఎలా ఉంటుందో చూద్దామని ఎంతో ఆశపడ్డాను. అడిగాను, బ్రతిమాలాను. అయినా మీరు నా కోరిక తీర్చలేదు. మిమ్మ ల్నెలాగైనా నవ్వించి గానీ ఈ ఊరు, వదలనని శపథం కూడా చేసుకున్నాను. కానీ లాభం లేకపోయింది. నేనే ఓడిపోయాను. నేను వెళ్ళిపోతున్నాను. కనీసం ఇప్పుడైనా నా యందు దయ ఉంచి ఒకే ఒక్కసారి... చిన్న చిరునవ్వు... చాలు. అంతకు మించి ఇంకేం వద్దు. ప్లీజ్... ప్లీజ్...'' అంటూ చాలా దీనంగా ముఖం పెట్టి ప్రాధేయపడ్డాను.

ఆమె ఎప్పటిలాగే నవ్వలేదు. నవ్వకపోయినా ఏం పర్వాలేకపోయేది. మామూలుగా వెళ్ళిపోయి ఉండేవాణ్ణి. కానీ, ఆమె భోరున ఏడ్చేసింది. కుమిలి కుమిలి ఏడ్చేసింది. ఒక్కసారే బరస్ట్ అయింది.

అనుకోకుండా ఏర్పడిన ఈ పరిణామం చూసి నేను బిత్తరపోయాను. ఏం చేయాలో పాలుపోలేదు. ఆమె నెలా ఓదార్చాలో అంతకంటే తెలీలేదు. అస లామె ఎందు కేడుస్తోందో తెలిస్తే కదా ఓదార్చడానికి!

కాసేపటికి ఆమె ఎలాగో దుఃఖాన్ని నిభాయించుకోగలిగింది. కళ్ళు తుడుచుకొని నావైపు చూసింది.

''తప్పయిపోయిం దండీ. మిమ్మల్ని ఎలాగైనా నవ్వించాలన్న ఆశతో పదే పదే విసిగించి, వేధించి చివరి కిలా ఏడిపించి వెళ్ళాల్సొస్తుం దనుకోలేదు'' అన్నాను పశ్చాత్తాపంగా.

''పర్వాలేదులెండీ. నా ముఖాన ఏడుపు రాసిపెట్టి ఉంది. ఏడ్చాను. దానికి మీరేం చేయగలరు? నా బ్రతుక్కు నవ్వే అదృష్టం లేదు. అందుకే నవ్వలేదు. మిమ్మల్ని నిరాశపరచినందుకు ఎంతో బాధపడుతున్నాను. వెళ్ళి రండి'' అన్నది చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ.

ఆమె మాటలు విని నేను చాలా ఆశ్చర్యపోయాను - ''అదేమి టలా అంటారు? సృష్టి మొత్తంలో మానవుడి కొక్కడికే ప్రసాదించబడ్డ వరం నవ్వు. నవ్వే హక్కు, అధికారం మనిషై పుట్టిన ప్రతివారికీ ఉంటుంది. కాదని ఎవ రనగలరు?'' అన్నాను.

ఆమె జీవంలేని నిట్టూర్పు ఒకటి విడిచింది. అప్పుడు నావైపు చూసి అడిగింది.


''హాయిగా పిల్లా పాపలతో ఇంటిని చక్కబెట్టుకోవలసిన నేను ఇలా టీ కొట్టు పడపాల్సిన అవసర మేమిటో ఊహించగలరా?''

''ఏముంది? వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు. మీ భర్త సంపాదనకి మీ సంపాదన తోడైతే ఆర్థికంగా త్వరగా పుంజుకోవచ్చు. భవిష్యత్తులో హాయిగా జీవితం గడపొచ్చు. మీ రీ పని చేయడం ఎంతైనా మెచ్చుకో తగ్గది. అందులో తప్పేం లేదు'' అన్నాను.

ఆమె అడ్డంగా త లూపింది - ''నా భర్త సంపాదన సున్నా. ఖర్చులు మాత్రం ఎక్కువ. ఇంటి ఖర్చులతో పాటూ ఆయన ఖర్చులు కూడా నేనే భరించాలి. అందుకు... అందుకు... నే నీ టీ కొట్టు నడిపేది'' అన్నది.

నాకు చాలా బాధ వేసింది. సానుభూతిగా చూసి - ''మీ భర్త ఏ పనీ చేయరా?'' అని అడిగాను కుతూహలం, కొద్దీ.

''ఎందుకు చేయరు? శుభ్రంగా



తప్పతాగుతారు, నుష్టుగా భోంచేస్తారు, ఆ తరువాత ఊరంతా తిరుగుతారు. నా దగ్గర డబ్బులున్న రోజున జూదం ఆడి వస్తారు.

డబ్బు లివ్వకపోతే తిడతారు, కొడతారు, జుట్టు పట్టి ఈడ్చి కాలితో తంతారు'' అన్నది దుఃఖాన్ని అదిమిపెట్టుకుంటూ.

"అయ్యో! అంత క్రూరుడా మీ భర్త?'' అన్నాను, ఇం కేమనాలో తెలీక.

"ఏం నా మాటల మీద నమ్మకం కలగడం లేదా? పోనీ ఇది చూడండి'' అంటూ ఆమె తన చెయ్యి వెనక్కి తిప్పి మోచేతి క్రింద చూపించింది. రెండంగుళాల మేర చర్మం నల్లగా కమిలిపోయి ఉంది. అట్లకాడతో ఎర్రగా కాల్చిన వాత అది!

"మై గాడ్' అన్నాను బాధగా.

"ఇది చూడండి'' అంటూ పైటకొంగు కొంచెం పక్కకి జరిపి కంఠానికి దిగువన ఛాతీ మీదున్న మచ్చని చూపించింది. చుట్టతో కర్కశంగా కాల్చితే ఏర్పడిన పుం డది.''

అది చూసి అప్రయత్నంగా నా కళ్ళు చిప్పిల్లాయి. విధి ఎంత క్రూరమైంది? అంత అందమైన అమ్మాయికి ఎన్ని కష్టాలు? రాజకుమారుడు వెదుక్కుంటూ రావలసిన చక్కని చుక్కకు హృదయం లేని రాతి గుండె మనిషా భర్త? వా డెవడో శాడిస్ట్ వెధవ అయి ఉంటాడు అనిపించింది.

నే నో సంగతి గమనించాను. తన సాంసారిక జీవిత విశేషాల్ని చెపుతున్నప్పుడూ, శరీరం మీద కాలిన గుర్తుల్ని నాకు చూపిస్తున్నప్పుడు నే నో పరాయి పురుషుడి నన్న ఆలోచన ఆమెకు కలగలేదో, లేక ఈ పదిహేను రోజుల పరిచయంలో నామీద అంతో ఇంతో ఆత్మీయత ఏర్పడిందో, ఆమె అలా చూపించడానికి ఎంత మాత్రం సంశయించలేదు.

"ఇప్పుడు చెప్పండి. నా గుండెలో అగ్నిపర్వతాలు బ్రద్ద లవుతూంటే నా ముఖంలో చిరునవ్వు రమ్మంటే ఎలా వస్తుంది? బలవంతాన నవ్వితే వచ్చేది జీవం లేని నవ్వే కదా. జీవం లేని నవ్వుతో ప్రకృతి ఇచ్చిన వరాన్ని అవమానించలేను కదా?'' అన్న దామె.

ఆమె మాటలు వింటుంటే బాగా చదువుకున్నదే అయ్యుండా లనిపించి ఆశ్చర్యపోయాను.

"క్షమించండి! మీ మనసులో రగులుతున్న అగ్ని శిఖల్ని గుర్తించలేక మీతో హాస్యంగా మాట్లాడాను. నవ్వండి నవ్వండని వేధించుకుతిన్నాను. అయామ్ సారీ!'' అని చెప్పి బరువెక్కిన హృదయంతో అక్కడి నుంచి కదిలాను.

నడుస్తున్నానే కానీ, ఆలోచనలు నన్ను ఇంకా విడిచిపెట్టలేదు. తూనీగల్లా మునురుకుంటున్నాయి. ఆ అందమైన ముఖంలో నవ్వు విరిస్తే ఇంకెంత అందంగా ఉంటుందో నన్న ఆలోచనే ఇంకా నన్ను వేధిస్తోంది. ఆమె ముఖంలో 'నవ్వు' చూడలేకపోయానే అన్న వెలితి వెలితిగానే మిగిలిపోయింది.

టక్కున నా కాళ్ళు ఆగిపోయాయి. నా మస్తిష్కంలో ఓ ఆలోచన తళుక్కు మంది. అదే ఆలోచనని ఆధారంగా చేసుకొని ఇంకా ఇంకా ఆలోచించాను.

నిజమే. ఒక ముఖం మీద నవ్వు విరబూయించడ మంటే మాటలతో అయ్యే పనా? నవ్వు చెరిపేసి ఆ స్థానంలో దుఃఖం కలిగించడం చాలా తేలికైన పని. ఆ పనిని ఎందుకూ కొరగాని ఓ మామూలు తాగుబోతు వెధవ కూడా చేయగలడు. అందుకు ప్రత్యక్ష సాక్ష్యం ఆమె భర్తే. కానీ అదే ముఖంమీద దుఃఖాన్నీ విషాదాన్నీ తుడిచేసి, ఆ స్థానంలో నవ్వుల సుమాల్ని పూయించడమంటే అంత తేలికైన పని కాదు. చిన్న చిన్న జోకులతో, మాటల చమత్కారాలతో అయ్యే పని అసలే కాదు. నవ్వు ఖరీ దేమిటో, జీవితం విలు వేమిటో ఆ క్షణంలో బోధపడింది నాకు.

అందుకే ఆ మాట ఆమె చెవిలో ఊదాలని నిశ్చయించుకున్నాను. అప్పటికీ ఆమె ముఖంలో నవ్వు తొంగి చూడకపోతే, ఇక ఆ దేవుడు కూడా ఏం చేయలేడు.

వెనక్కి తిరిగి మళ్ళీ ఆమె దగ్గరికి వెళ్ళాను. ఆమె ఆశ్చర్యంగా చూసింది ఏమి టన్నట్టు.

మనసులోనే మరొక్కసారి స్థిరమైన నిర్ణయాని కొచ్చి, ఆమెకి బాగా దగ్గరికి వెళ్ళి చెవిలో నేను చెప్పా లనుకున్న మాట ఊదేశాను. ఆమె ఉలిక్కిపడింది. కలవరపాటుగా చూసింది. నేను చెవిలోనే ఆమె సందేహాలన్నీ పోగొట్టి కన్విన్స్ అయ్యేలా చేశాను.


అప్పుడు...! అప్పుడు...! అప్పుడు వెలిగిం దొక నవ్వు!

వెన్నెల కురిసినట్టు, హరివిల్లు విరిసినట్టు చిరునవ్వు మెరిసింది - అరవిరసిన ఆమె పెదాలమీద! ఎన్నో ఏళ్ళ తరువాత తన స్వస్థానాన్ని చేరిన సంబరంలో ఆ నవ్వు ఆమె పెదాల మీద ఆనంద తాండవం చేసింది. దీపం వెలిగింది. పద్మం వికసించింది!

ఇంతకీ ఆమె చెవిలో నే నూదిన మహత్తరమైన ఆ మాట ఏమిటో తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది కదూ?

నేను చెప్పను.

చెపితే లోకం దాని కెలాంటి తుచ్ఛమైన పేరు పెడుతుందో నాకు తెలుసు. ఎలాంటి వక్రభాష్యం చెపుతుందో కూడా తెలుసు. అందుకే నేను చెప్పను. అంతగా కుతూహలం ఆపుకోలేకపోతే, మీరే ఊహించి కనుక్కోండి! ★



### కవచం

ముని తపస్సుకు ప్రత్యక్షమయ్యాడు శ్రీమహావిష్ణువు.

"మీరు ఎప్పుడూ తలమీద ఆ కిరీటాలు ఎందుకు ధరిస్తారు స్వామీ?" అని అడిగాడు ముని స్వామిని.

"మేము మా లోకంలో ఉన్నప్పుడు ఇవి ధరించం నాయనా! ఇలా భూలోకం వచ్చినప్పుడు మీ కోరిక లిస్ట్ విని, ఎక్కడ మా తలలు వాచి, పటేల్మని పగులుతా యోనని కవచంలాగా పెట్టుకొస్తాంటాం" అన్నారు స్వామి.

కె.సి. బాబు [నెల్లూరు]

